## క్లుప్తంగా

### గొర్రెల పెంపకందార్లకు అవగాహన



ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న వెటర్నరి పాలిటెక్నిక్ విద్యార్థులు

ప్యాపిలి: గొర్రెల పెంపకందార్లు జీవాలపై జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ అన్నారు. మండల పరిధిలోని బావిపల్లి గ్రామంలో గురువారం కళాశాల విద్యార్థులతో కలిసి ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గొర్రెల పెంపకందార్లకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు, లివర్ సప్లిమెంట్స్ ఇస్తున్నట్లు తెలిపారు. పశువైద్యుల సూచనలు పాటిస్తూ గొర్రెల పెంపకాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు.

### శ్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు



జేసీబీతో మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో గురువారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో తొలగించే పనులు చేపట్టారు. గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందులు పడుతుండడంతో శుభ్రం చేయించామని ఆయన తెలిపారు. అలాగే బ్రిడ్జి కింద భాగంలోని వాగులో చెత్త చెదారం పేరుకుపోయి మురుగునీరు నిల్వ చేరడంతో ముందుకు పోయేలా చేశామన్నారు. గ్రామస్తులు చెత్తచెదారాన్ని వాగులో వేయరాదని కోరారు.

### గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



రామాంజనేయులు(ఫైల్)

డోన్ టౌన్: మండలంలోని గోసానిపల్లె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దలవాయి రామాంజనేయులు (45) గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న డోన్ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ట్రాక్టర్ కింద పడ్డ బైక్

అవుకు(కొలిమిగుండ్ల): మండలంలోని సంగపట్నం–శింగనపల్లె రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సంగపట్నానికి చెందిన బాషా, మధు పని నిమిత్తం బైక్‌పై అవుకు బయలు దేరారు. మార్గమధ్యలో కోవెలకుంట్లకు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికుల సాయంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### ఉసేన్‌స్వామికి ఫాతెహాల సమర్పణ



ఉసేన్‌స్వామి దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. గ్యార్మీ నెల కావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో నిండిపోయింది. ఆయా ప్రాంతాల కు చెందిన భక్తులు స్వామి వారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# జైలు గదులే.. ఐటీఐ తరగతులు

- అసౌకర్యాల మధ్య విద్యార్థుల చదువులు
- 2008 కళాశాల మంజూరు



బ్రిటీషర్ల కాలంలోని సబ్‌జైలులో నిర్వహిస్తున్న ఐటీఐ కళాశాల



రేకుల షెడ్డులో అసౌకర్యాల మధ్య చదువుకుంటున్న విద్యార్థులు

అవుకు (కొలిమిగుండ్ల): స్వాతంత్ర్యం రాకముందే బ్రిటిష్ పాలనలో నిర్మించిన వందేళ్ల పాత సబ్‌జైలులోనే అవుకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాల నడుస్తోంది. కాలం చెల్లిన ఈ భవనం ఇప్పుడు విద్యార్థులకు పాఠశాల కంటే శిక్షాస్థలంలా మారింది. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఐటీఐ కళాశాల ప్రారంభమైంది. అప్పట్లో విద్యార్థుల సౌకర్యార్థం సిబ్బందిని నియమించినా, భవన నిర్మాణం మాత్రం వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం అవుకు, కొలిమిగుండ్లతో పాటు పరిసర మండలాల విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు.

**ఖైదీల బ్యారక్‌లలో తరగతులు**

పూర్వం ఖైదీలను నిర్బంధించిన జైలు బ్యారక్‌లలోనే ఇప్పుడు విద్యార్థులు కూర్చుని పాఠాలు నేర్చుకుంటున్నారు. భవనం పైకప్పు నుంచి నీరు కారుతుండగా, గోడలు పాడైపోవడంతో వర్షకాలంలో తరగతులు నిర్వహించడం సవాలుగా మారింది. కళాశాలలో ప్రస్తుతం 360 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రెండేళ్ల ట్రేడ్‌లకు సంబంధించి డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ కోర్సులు, ఏడాది ట్రేడ్‌లో కంప్యూటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులు ఉన్నాయి. అయితే, వీటికి తగిన ల్యాబ్‌లు, పరికరాలు, క్లాస్‌రూమ్‌లు లేకపోవడంతో సమీపంలోనే రేకుల షెడ్డు నిర్మించి బోధన చేస్తున్నారు.

**నేలపై కూర్చోవాల్సిందే**

కొంతమంది విద్యార్థులు బల్లలపై, మరికొంతమంది నేలపైనే కూర్చుని పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి. ప్రయోగాలు చేయడానికి అవసరమైన పరికరాలు, ల్యాబ్ వసతులు లేక ప్రాక్టికల్స్ చేయడం దాదాపు అసాధ్యంగా మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిర్మాణానికి నోచుకోని కొత్త భవనం**

గతంలో ఐటీఐ కోసం పట్టణానికి సమీపంలోని కొండ వద్ద 10 ఎకరాల స్థలం కేటాయించి రూ.6 కోట్లు మంజూరు చేసినా, నిర్మాణం ప్రారంభం కాలేదు. ఫలితంగా విద్యార్థులు ఇప్పటికీ వందేళ్ల పాత భవనంలోనే చదువుకోవాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం అయినా చొరవ చూపి బ్రిటిష్ కాలం నాటి సబ్‌జైలు నుంచి విముక్తి కల్పించి, ఆధునిక వసతులతో కొత్త ఐటీఐ భవనం నిర్మించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### 12 వేల హెక్టార్లలో రబీ సాగు

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో కోవెలకుంట్ల మండలంలో 12 వేల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యమని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలో అత్యధికంగా 8,227 హెక్టార్లలో పప్పుశనగ, 1,775 హెక్టార్లలో జొన్న, 871 హెక్టార్లలో వరి, 640 హెక్టార్లలో మినుము, 214 హెక్టార్లలో మొక్కజొన్న, 35 హెక్టార్లలో కంది, మిగిలిన విస్తీర్ణంలో వివిధ రకాల పంటల సాగు సాధారణ విస్తీర్ణమని వెల్లడించారు. ఇటీవల కురిసిన వర్షాలు సాగుకు అనుకూలమని.. పొలాల్లో తడి ఆరిన వెంటనే విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు.

### వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధన లు పాటించాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించా రు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనా ల తనిఖీ చేపట్టారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, తాడిపత్రి, తదితర ప్రాంతాలవైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని పేర్కొన్నారు.

## గతుకుల రోడ్డుపై అవస్థల ప్రయాణం



తవిసికొండ గ్రామం వద్ద దెబ్బతిన్న రహదారి



పాపసాని కొట్టాల వద్ద కంకర తేలిన రోడ్డు



బలపాలపల్లె గ్రామం వద్ద..

బేతంచెర్ల మండల పరిధిలోని బలపాలపల్లె, పాపసాని కొట్టాల, తవిసి కొండ గ్రామాల మధ్య రహదారి దెబ్బతిని గతుకులమయంగా మారింది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఈ రహదారి గత ఏడాది నుంచి అధ్వానంగా తయారైంది. వర్షాలు, వాహన రాకపోకలతో గుంతలు ఏర్పడి ప్రయాణం కష్టసాధ్యమైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఈ మార్గం మీదుగా ప్రయాణించే వాహనదారులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేసి సౌకర్యవంతంగా మార్చాలని కోరుతున్నారు. –బేతంచెర్ల

## వరుస చోరీలతో ప్రజల్లో భయాందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

డోన్ టౌన్: కొద్ది నెలలుగా పట్టణంలో వరుస దొంగతనాలు, మహిళలపై దాడులు, వీధి గొడవలు, గంజాయి మత్తులో దాడులు ప్రజల్లో తీవ్ర భయాందోళనలకు దారితీస్తోందని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు, ఏఐటీయూసీ కార్యదర్శి అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక నక్కి రామన్న భవన్‌లో వారు మాట్లాడారు. ఈ నెల 14న పట్టణంలోని శ్రీరామనగర్‌లో పోలీసే దొంగగా మారి మహిళ మెడలోని బంగారు చైన్ లాగేసిన ఘటన పోలీసు శాఖకే చెడ్డపేరు తెచ్చిందన్నారు. ఈశ్వర్ ఆచారిని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో దొరపల్లె గ్రామ సీపీఐ కార్యదర్శి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): వచ్చే నెల 17, 18 తేదీల్లో బేతంచెర్లలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. గురువారం నంద్యాల కార్యాలయంలో ఏసురత్నం అధ్యక్షతన జిల్లా మహాసభల జయప్రదానికి సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేస్తూ పని గంటలు పెంచుతూ కార్మిక వర్గాని తీవ్రంగా మోసం చేసిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఐసీ, బ్యాంకు, రైల్వే, పోర్టులు, కేంద్ర గిడ్డంగి సంస్థలు, ప్రైవేటుకు అప్పజెబుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. అంగన్‌వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, వైద్య రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో కాలనీలు



సరైన రోడ్డు మార్గం లేని సంజీవనగర్ కాలనీ



సబ్ రిజిస్ట్రార్ కాలనీ సమీపంలో పెరిగిన కంప చెట్లు

బేతంచెర్ల: పట్టణంలోని అనేక కాలనీలు ఇప్పటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. సమస్యలతో ప్రజలను స్వాగతిస్తున్నాయి. 15 నుంచి 20 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ కాలనీల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రణాళికాబద్ధత లోపంతో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంజీవనగర్, హనుమాన్‌నగర్, సుబ్బారెడ్డి నగర్, ఎన్జీవోస్ కాలనీ, జంగాలపేట, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం పరిసరాల్లోని కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. ప్రత్యేకంగా సంజీవనగర్ సమీపంలోని గట్టు నరసింహాస్వామి ఆలయం పరిసరాల్లో కొండప్రాంతంలో నివాసాలు ఏర్పడ్డాయి. కానీ నేటికీ అక్కడ మట్టి రోడ్లు కూడా లేవు. కొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా మట్టి రోడ్లు వేసినా డ్రైనేజీ వ్యవస్థ లేక దుర్వాసన, చెత్త సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. మరికొన్ని కాలనీల్లో కొంతమంది ఇళ్లు నిర్మించగా, మరికొంతమంది నిర్మించకపోవడంతో కంపచెట్లు, పొదలతో వీధులు మూసుకుపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాల్వలు, సీసీరోడ్లు, మట్టి రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు కంపచెట్లను తొలగించి సౌకర్యంగా మార్చాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

### నత్తనడకన సాగు



ఎరువు వేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: పప్పుశనగ సాగును రైతులు మాతృ పంటగా భావిస్తారు. మండలంలో మెట్ట పంటల్లో భాగంగా అధికంగా ఏటా శనగను విస్తారంగా సాగు చేస్తారు. అయితే సాగుకు నెల రోజుల ముందు పొలాల్లో రసాయన ఎరువులను విత్తుతారు. కానీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగు ఆలస్యం అవుతోంది. ఏటా ఈ సమయానికి విత్తన పనులు ఊపందుకునేవి. ప్రస్తుతం భారీ వర్షాలతో పొలాల్లో తడి ఇంకా అలాగే ఉండటంతో సేద్యం పనులు జరగకపోవడంతో బీళ్లుగా మారాయి. గత రెండు రెండు రోజుల నుంచి కాస్త విరామం ఇవ్వడంతో రైతులు రసాయన ఎరువులు విత్తే పనుల్లో నిమగ్నం అయ్యారు. కానీ ఎదో ఒక సమయంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోని జల్లులు కురుస్తుండటంతో ఈ పనులు కూడా ముందుకు సాగడం లేదు. మండలంలోని క్రిష్టిపాడు, దొర్నిపాడు, గుండుపాపల, చాకరాజువేముల, డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో శనగ పంటను 4 వేల హెక్టార్లలలో సాగు చేస్తారు.

### ప్రధాని మోదీ నోట మహానంది మాట

మహానంది: 'మహానంది కే శ్రీ మహానందీశ్వర స్వామికో ప్రణామ్ కర్తాహు' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావించడం ఆలయ విశిష్టత, చరిత్ర ఎంతటి గొప్పదో తెలుస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలులో గురువారం జరిగిన జీఎస్టీ సభలో ఆయన మాట్లాడుతూ మహానంది, అహోబిలం, మంత్రాలయం ఆలయాల్లో కొలువైన శ్రీ అహోబిల నరసింహస్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామిలకు నమస్కరించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### కొనసాగుతున్న నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు

దొర్నిపాడు: వెల్త్ అండ్ హెల్త్ ఫైనాన్షియల్ సొలుష్యన్స్ బాధితుల నిరసన గురువారం మూడో రోజుకు చేరింది. స్థానిక ప్రధాన రహదారిపై బాధిత మహిళలు, పురుషులు కూర్చొని తమకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. బాధితుడు తేజ మాట్లాడుతూ ఒక్కొక్కరి నుంచి రూ.3.50 లక్షలు దండుకుని ఉద్యోగాలు చూపకుండా బోర్డు తిప్పేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ఉద్యోగాలు వద్దని, డబ్బు తిరిగి ఇవ్వాలన్నారు. ఇళ్లు, బంగారు నగలు తాకట్టు పెట్టి నగదు తెచ్చామన్నారు. ప్రభుత్వం వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని మోసపోయిన తమకు న్యాయం చేయాలని కోరారు.

### మద్యం మత్తులో వ్యక్తిపై దాడి



గాయపడిన రంగవలి

డోన్ టౌన్: మద్యం మత్తులో వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటన డోన్‌లోని కొత్రికె జిన్నులో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పట్టణంలోని కొత్రికె జిన్నులో ఉన్న రఫీ రైస్ మిల్లులో రంగవలి హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ రైస్ మిల్లు సమీపంలో ఆర్‌ఎంపీ వైద్యుడు బాలు మరికొందు ప్రతి రోజు మద్యం సేవిస్తుంటారు. గురువారం మద్యం సేవించి ఖాళీ మద్యం బాటిళ్లను పడవేయడంతో రంగవలి, బాలు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న బాలు, మరికొందరు రంగవలిపై కర్రతో తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి హమాలీలు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు బాలు రైస్ మిల్లు సమీపంలోని పాత సంచుల గోడౌన్ యజమాని గౌడ్‌పై కూడా దుర్భాషలాడి దాడికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ విషయంపై గౌడ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసలు విచారణ చేస్తున్నారు.

## వర్షం.. అన్నదాతల్లో టెన్షన్



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ఇటీవల కాలంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ రావడంతో రైతులు వివిధ పంటల సాగుకు సమాయత్తమయ్యారు. అయితే గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండి సాయంత్రానికంతా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని చిన్నపాటి వర్షం కురిసింది. వివిధ పంటల సాగుకు సరైన అదును కాగా వర్షాలు వెంటాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. కాగా సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో 55,609 హెక్టార్లలో వరి, జొన్న, మొక్కజొన్న, పప్పుశనగ, కంది, మినుము, పెసర, తదితర పంటల సాగు సాధారణ విస్తీర్ణం. వరుసగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో తేమ శాతం ఆరకపోగా గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి పొలాలు బీళ్లుగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రబీ మొదటి పంటగా 40,016 హెక్టార్లలో పప్పుశనగ, 7,119 హెక్టార్లలో జొన్న, 2,423 హెక్టార్లలో కంది, 1,332 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు సాగు కావాల్సి ఉంది. రసాయన ఎరువులు, విత్తనాలు సమకూర్చుకుని విత్తనానికి సిద్ధంగా ఉన్న తరుణంలో రైతులను వర్షాలు వణికిస్తున్నాయి.

## విభజన హామీలపై ఎందుకు ప్రశ్నించడం లేదు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

బనగానపల్లె రూరల్: విభజన హామీలపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ ఎందుకు ప్రశ్నించడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రధాని పర్యటన వల్ల రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఇస్తామన్న ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దద్దణాల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి రూ.25 లక్షలు ఖర్చు చేసినా ప్రాజెక్టులో నీరు నింపడంలో విఫలమైనట్లు ఆరోపించారు. పలుకూరు గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఆ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. మంత్రి బీసీ చొరవ తీసుకుని నిలుపుదల చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని కోరారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం దొర్నిపాడులో నిరుద్యోగుల నుంచి రూ.150 కోట్ల వరకు వసలూ చేశారని, ఈ స్కాంలో టీడీపీ నాయకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శివబాలకృష్ణ, శివయ్య, సుబ్బారెడ్డి, సంజీవులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేయాలి



నూతన ఉపాధ్యాయులకు సర్వీసు రికార్డులను అందజేస్తున్న ఎంఈఓలు

డోన్ టౌన్: డీఎస్సీలో ఉద్యోగం పొందడానికి అహర్నిశలు శ్రమించి పట్టుదలతో సాధించారని.. ఉద్యోగంలోనూ అదే అంకిభావం, నిబద్ధతతో పనిచేయాలని మండల విద్యాధికారులు ప్రభాకర్, రఘునాయక్ సూచించారు. ఇటీవల ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారికి పట్టణంలోని నెహ్రూనగర్ హైస్కూల్‌లో గురువారం ఎంఈఓలు సర్వీసు రికార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. వారి ఉన్నతికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం తొగట సురేష్‌బాబు, ఎస్టీయూ నాయకులు షణ్ముర్తి, భాస్కర్, మహ్మద్‌ఇక్బాల్, సుంకన్న, వెంకటనాయక్, విశ్వనాథ్, రమణ, మౌలాలి, పెద్దయ్య, హరిలాల్, దేవేంద్రప్ప, నందప్ప, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.